

సమావేశంలో కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ప్రజలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే కృష్ణారావు

హైదర్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉండాలని, అదేవిధంగా డివిజన్‌లలో ఎక్కడైనా రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉంటే తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. హైడ్రాకి సంబంధించి ప్రజల్లో ఒక భయం ఏర్పడిందని దీనిని తుడిచిపెట్టే బాధ్యతను కార్పొరేటర్లు తీసుకోవాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ వేడుకలకు ఎక్కడా ఆటంకం లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, శిరీష, బాబురావు, సబిహా గౌసుద్దీన్, ముద్దం నర్సింహయాదవ్, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, శ్రావణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నగదు అందజేస్తున్న వినాయక భక్త బృందం సభ్యులు

లడ్డూ వేలం డబ్బుతో పేదలకు పింఛను అందజేత

హైదర్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వినాయకభక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూ వేలం ద్వారా వచ్చిన నగదును ఒంటరి మహిళలకు, వితంతువులకు, వయోవృద్ధులకు పింఛను అందజేస్తున్నట్లు భక్త బృందం చైర్మన్ నాయినేని సూర్యప్రకాశ్‌రావు తెలిపారు. వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో 12 ఏళ్ల నుంచి మూడు నెలలకు రూ.900ల చొప్పున సంవత్సరానికి 3,600 రూపాయలను ప్రతి యేటా సుమారు 150 మందికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరంలాగే ఈ ఏడాదీ గణేశ్ లడ్డూ వేలం ద్వారా వచ్చిన డబ్బును ప్రజాసేవ కోసం ఉపయోగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ అర్యనపల్లి సూర్యారావు, ఉపాధ్యక్షుడు నాయినేని పద్మారావు, కోశాధికారి చౌదరి సూర్యరావు, కార్యదర్శి అనంతనాగరాజు, సభ్యులు నర్సింగ్‌రావు, దేవయ్య పాల్గొన్నారు.



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు

తిరుమల లడ్డూ కల్తీ దోషులను శిక్షించాలి

హైదర్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో కల్తీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్త నిరసనకు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. లడ్డూ వివాదంపై సిట్టింగ్‌జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించాలని, పీఠాధిపతులు ఆధ్యాత్మిక, సామాజికవేత్తలతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసి దేవాలయాల నిర్వహణ వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కూకట్‌పల్లి అధ్యక్షుడు వినోద్, జనార్దన్, సత్యనారాయణ, పవన్, సుదర్శన్, శేఖర్‌గుప్తా, హరి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

హిందూధర్మంపై దాడులకు నిరసనగా ర్యాలీ

నిజాంపేట్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులు, సనాతన ధర్మంపై జరుగుతున్న కుట్రలకు నిరసనగా జాతీయ స్థాయి ఆందోళనలో భాగంగా విశ్వహిందూ పరిష్యత్ ఆధ్వర్యంలో సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్‌లో మల్లన్నస్వామి దేవాలయం నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిద్దెల బాల్‌రెడ్డి

బౌరంపేట సొసైటీ రైతులకు త్వరలోనే రుణమాఫీ

దుండిగల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ గురించి జిల్లా బ్యాంక్ వారితో, వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదించామని త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని బౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు మిద్దెల బాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం బౌరంపేట గ్రామంలోని సహకార సంఘ కార్యాలయంలో బాల్‌రెడ్డి అధ్యక్షతన సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు, రైతులు సమక్షంలో సపరిపాలన నివేదికను ప్రవేశపెట్టారు. సంఘం నికర లాభం రూ.49.88 లక్షలు ఉన్నట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి సయ్యదుల్లా, ఉపాధ్యక్షులు వెంకటేశ్, డైరెక్టర్లు భీమ్‌రెడ్డి, కృష్ణయ్య, మహిపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, యాదయ్య, జీతయ్య, మోహన్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌గర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్ వెస్ట్‌కాలనీలో సీసీరోడ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నాణ్యతాప్రమాణాల విషయంలో రాజీపడొద్దని తెలిపారు. రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, రాజేష్‌చంద్ర, వీరస్వామి, జ్యోతిబా, సాయి, కోటేశ్వరరావు, రామయ్యచౌదరి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



సాయినగర్‌వెస్ట్‌లో సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైడ్రాను విమర్శించడం తగదు: గోపాలరావు

కేపీహెచ్‌బీకాలనీ: చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన హైడ్రాను విమర్శించడం తగదని ప్రజాలోచన వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైడ్రా సుపరిపాలనకు దారితీస్తుందని, బాధ్యతగల పౌర సమాజ నిర్మాణానికి తోడ్పతుందన్నారు. ప్రజలు, నాయకులు, పాలనా యంత్రాంగం చట్టబద్ధంగా నడుచుకోవాలనే ఉద్దేశంతో హైడ్రా పని చేస్తోందని తెలిపారు.

రైతు దీక్షకు తరలివెళ్లిన రైతులు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన రైతుదీక్షకు కొంపల్లి మున్సిపల్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ఇచ్చి నేటికి అమలు చేయడంలో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కో-కన్వీనర్ పి.శివాజీరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌సాగర్, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితారావు, మధు, పాల్గొన్నారు.

అటకెక్కిన చెరువుల అభివృద్ధి

- పటేల్, గంగారం చెరువుల సుందరీకరణలో జాప్యం
- ఐదేళ్లుగా నత్తనడకన పనులు
- న్యాయపరమైన వివాదాలతోనే జాప్యం అంటున్న అధికారులు
- మురికి కూపాలు, డంపింగ్ యార్డులుగా మారుతున్న చెరువులు

మియాపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సాగు, తాగునీటితో కళకళలాడిన చెరువులు నేడు క్రికెట్ మైదానాన్ని తలపిస్తూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులతో కొంతవరకు చెరువులు నీటితో కళకళలాడాయి. కానీ చెరువుల సుందరీకణ, అభివృద్ధి పనులతో చేపట్టిన ఇక్కడి చెరువులు మాత్రం చెత్తాచెదారంతో డపింగ్‌యార్డులుగా, మురికినీటికి ఆవాసాలుగా మారాయి. ఐదేళ్లుగా సుందరీకరణ పనుల జాప్యంతో చెరువులు వర్షాకాలంలోనూ నీళ్లలేక వెలవెలబోతున్నాయి. గోలుసు కట్టు చెరువులకు ప్రసిద్ధిగాంచిన శేరిలింగంపల్లిలో మియాపూర్ 9వ నెంబర్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న మియాపూర్‌లోని పటేల్‌చెరువు, గంగారంలోని పెద్దచెరువు రెండు ఐదేళ్ల క్రితం నిధులు వెచ్చించి సుందరీకరణ పనులు చేపట్టారు. రెండు చెరువులు విస్తీర్ణంలో పెద్దగా ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలతో సగానికి పైగా కనుమరుగయ్యాయి. ఇటీవల కొత్తగా వచ్చిన హైడ్రా ఇక్కడ అక్రమ నిర్మాణాలకు నోటీసుల ఇవ్వడమే కాకుండా ఇచ్చిన 80 అనుమతులు కూడా రద్దు చేసింది. అయితే చెరువుకట్ట అభివృద్ధి పనులు, వాకింగ్‌ట్రాక్‌లు పూర్తైనపట్టికీ చెరువుకు పటేల్‌చెరువు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సివరేజ్ ప్లాంట్ నిర్మాణం పూర్తైనపట్టికి ఔట్‌లెట్ కలపడానికి జాప్యం జరుగుతోంది. దీంతో మురుగునీటిని పంపే కాల్వ నిర్మాణాలు పూర్తి కాలేదు. చెరువులో ఉన్న గుర్రపుడెక్కను పలుమార్లు తొలగించినపట్టికీ మళ్లీ చెరువును గుర్రపుడెక్క ముంచేస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు సైతం ఈ చెరువులను నింపలేకపోయాయి. నీళ్ల లేక ఈ చెరువులు మురికి కూపాలుగా మారా యి. ఇప్పటికే ఈ చెరువుచుట్టు ఉన్న కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, బస్తీలు చెరువులో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మరోపక్క చెరువు సుందరీకరణ పనులపై ఇప్పటికే పలుమార్లు న్యాయపరమైన విబేధాలు త్వరగా తేల్చాలని స్థానిక ఎమ్మెల్యే గాంధీ అనేక సమావేశాలు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. ఇక్కడి చెరువులు అభివృద్ధికి నోచుకోకపోవడమే కాకుండా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని కాలనీల వాసులు అధికారులను కోరుతున్నారు.



మురికికూపంగా పటేల్‌చెరువు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి.

టమాట	రూ.55	ఉల్లిగడ్డ	రూ.50
వంకాయ	రూ.35	మామిడికాయ	రూ.15-20
బెండకాయ	రూ.35	అరటికాయ	రూ.8-9
పచ్చిమిర్చి	రూ.28	చామగడ్డ	రూ.35
బజ్జి మిర్చి	రూ.65	ముల్లంగి	రూ.4-5
కాకరకాయ	రూ.38	చిలగడదుంప	రూ.45
బీరకాయ	రూ.35	గుమ్మడికాయ	రూ.25
క్యాబేజీ	రూ.19	నిమ్మకాయలు	రూ.50-60
బీన్స్	రూ.60	మునగకాయలు	రూ.8-10
క్యారెట్	రూ.40	బొప్పాయి	రూ.40
గోబిపువ్వు	రూ.23	పుట్టగొడుగులు	రూ.40
దొండకాయ	రూ.37	ఎండుమిర్చి	రూ.220
చిక్కుడుకాయ	రూ.55	అల్లం	రూ.200
గోరుచిక్కుడు	రూ.35	వెల్లుల్లి	రూ.380
బీట్‌రూట్	రూ.28	చింతపండు	రూ.140
క్యాప్సికం	రూ.70	పండుమిర్చి	రూ.80
ఆలుగడ్డ	రూ.40	ఉసిరి	రూ.70
కీర	రూ.21	కరివేపాకు	రూ.60
దోసకాయ	రూ.28	పర్వల్	రూ.35
సొరకాయ	రూ.23	పల్లికాయ	రూ.60
పొట్లకాయ	రూ.18	లోబా	రూ.25
కంద	రూ.55	ఆ కాకరకాయ	రూ.120
ఉల్లిపొరక	రూ.55		

ఈ ధరలు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

స్కూల్ భవనాలపై అక్రమంగా వెలుస్తున్న షెడ్లు

నిజాంపేట్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ నిజాంపేట్ గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాల భవనంపైన నిర్వాహకులు అనుమతులు లేకుం డా భారీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయమై స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టి కి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కనీస అనుమతులు లేకుండా ఎవరైనా షెడ్డు నిర్మిస్తే, ఆగమేఘాల మీద కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు స్కూల్‌పైన నిర్మిస్తున్న షెడ్డును కూల్చే విషయం లో నోరు మెదపడం లేదు. కేవలం నోటీసులు చేతులు దులుపుకున్నారు. చర్యలు తీసుకోలేదని ఎవరైనా అడిగితే టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది లేరని, సమాధానం ఇస్తూ దాటవేస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన నూతన కమిషనర్ ఈ అక్రమ షెడ్డుపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవా లని స్థానికులు కోరుతున్నారు.



ఓ స్కూల్ పైఅంతస్తులో నిర్మించిన అనుమతి లేని షెడ్డు

సవాళ్లను అధిగమించడంలో ఆవిష్కరణలు కీలకం

మహేంద్ర విశ్వ విద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో సుకుమార్ మిశ్రా వెల్లడి

దుండిగల్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): సవాళ్లను అధికమించడంలో ఆవిష్కరణలు కీలకమని ఐఐటీ ధనబాగ్ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా అన్నారు. బహదూర్‌పల్లిలోని మహేంద్ర విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో సుకుమార్ మిశ్రా సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం అభివృద్ధి చేసే పరిష్కారాలు రేపటి భవిష్యత్‌కు దారి చూపుతాయన్నారు. అనంతరం మహేంద్ర యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మేదూరి మాట్లాడుతూ.. సమగ్ర ఆలోచనలు సృజనాత్మకతను పోత్సహించడం ద్వారా దేశం మేధో రాజధానిగా ఎదుగుతుందన్నారు. పరిశోధనాభివృద్ధి రంగాల్లో కొత్త ఆవిష్కరణలు భాగస్వాములతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో మహేంద్ర యూనివర్సిటీ ఎలక్ట్రికల్ కంప్యూటర్ ఇంజనీర్ విభాగాధిపతి ప్రొ.రాము వేమూరి, మ్యాథ్ వర్క్స్ సీనియర్ ఇంజనీర్ రమణారెడ్డి, కంప్యూటర్ ఇంజనీర్ ప్రొ.శ్రీనివాస్ కటికూరి, ఎల్రానిక్ ప్రిన్సిపల్ ఇంజనీర్ శ్రీకృష్ణ, ఎస్‌హెచ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈవీఎస్‌ఈ చార్జింగ్ స్మార్ట్‌గ్రిడ్ సెక్యూరిటీపై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొ.భార్గవ రాజారామ్, భువనేశ్వరి, గోపీనాథ్, శ్రీధర్ మాడిశెట్టి, టెక్నికల్ సెషన్‌లకు అధ్యక్షత వహించారు.



సదస్సులో పాల్గొన్న అతిథులు

అంబేడ్కర్‌వర్సిటీ భూమిని జేఎన్‌ఎఫ్‌ఏయూకి కేటాయించొద్దు

- వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి సంబంధించిన పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్‌ఎఫ్‌ఏయూ) కేటాయించొద్దని పూర్వ విద్యార్థుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఉన్నత విద్యా వ్యాప్తిలో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఉన్నత విద్యనందిస్తోందని తెలిపారు. ఇలాంటి విశ్వవిద్యాలయ భూమిని వేరు వర్సిటీకి కేటాయించడాన్ని అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. వర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ తీసుకునే నిర్ణయాలకు అసోసియేషన్ పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు సమావేశంలో తీర్మానించారు. ప్రభుత్వం 10 ఎకరాల భూమి కేటాయింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ నోడల్ ఆఫీసర్ డా.బానోత్ ధర్మ, అసోసియేషన్ అధ్యక్షుడు సాకా వెంకటేశ్వర్‌రావు, సెక్రటరీ డా.ఉదయని, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్మికులకు వైద్యశిబిరం

హైదర్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ - 2024 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ శిబిర్ శాతవాహన కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ స్వచ్ఛ కార్మికులందరు ఆరోగ్యనియమాలు పాటించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికులు ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

రుణభారం మోయలేక..

చావే శరణ్యమని భావించి..

- పురుగుల మందు తాగిన తల్లిదండ్రులు, ముగ్గురు కుమారులు

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. భార్యాభర్తలు, ముగ్గురు కుమారులు పురుగుల మందు తాగిన సంఘటన సోమవారం రాత్రి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్(60), లత(55) దంపతులకు సందీప్(30), సాయిస్వరూప్(28), వంశీకృష్ణ(26) సంతానం. వెంకటేశ్వర ప్రసాద్ తొమ్మిదేళ్ల క్రితం కుటుంబం తో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాంనగర్ కాలనీలో నివసిస్తూ గౌతంనగర్ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నారు. వెంకటేశ్వరప్రసాద్, రెండో కుమారుడు సాయి స్వరూప్ కిరాణదుకాణం నడుపుతుండగా, మొదటి కుమారుడు సందీప్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడో కుమారుడు వంశీకృష్ణ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు.



స్ట్రెచర్‌పై వెంకటేశ్వర ప్రసాద్, లత దంపతులు

దుకాణం కోసం రూ. 12 లక్షల అప్పు

రూ.12 లక్షలు అప్పు చేసి కిరాణా దుకాణాన్ని అభివృద్ధి చేశారు. గతేడాది దుకాణం ఉన్న వీధిలో రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. పనులు పూర్తికాకపోవడంతో గిరాకీ తగ్గింది. రాబడి తగ్గడం, అప్పులకు వడ్డీ చెల్లిస్తుండడంతో పూట గడవడం కష్టం అయింది. ఏడాది నుంచి దుకాణం సరిగా నడవకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయారు. వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అప్పు ఇచ్చిన వారు డబ్బు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో కొన్ని నెలలుగా తీవ్ర మానసికక్షోభకు గురవుతున్నారు. వీటి నుంచి బయట పడాలంటే తమకు చావే శరణ్యమని భావించారు. ఈ క్రమంలో సాయి స్వరూప్ గౌలిగూడ వెళ్లి పురుగుల మందు కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. సోమవారం రాత్రి ఐదుగురు కుటుంబసభ్యులు పురుగుల మందును నీటిలో కలుపుకుని తాగారు.

పురుగుల మందు తాగామంటూ కిరాయిదారుడికి ఫోన్

తాము పురుగుల మందు తాగామని వెంకటేశ్వరప్రసాద్ తమ ఇంట్లో కింది పోర్షన్‌లో కిరాయికి ఉంటున్న వారికి ఫోన్ చేసి చెప్పాడు. వారు వెంటనే 100, 108కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చి పైకి వెళ్లి తలుపు కొట్టారు. స్పృహలో ఉన్న రెండో కుమారుడు తలుపులు తీశాడు. పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్‌ఐ మారయ్య ఐదుగురినీ 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు కుమారుల ఆరోగ్యం నిలకడగా ఉందని, భార్యాభర్తలు అపస్మారకస్థితిలో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారని ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ట్రోఫీని గెలుచుకున్న ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ వైద్య బృందం

ముగిసిన ఆహా శతాబ్ది ఉత్సవాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఆహా) శతాబ్ది ఉత్సవాలు హెచ్‌ఐసీసీలో ముగిసాయి. శతాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా మూడు రోజులపాటు జరిగిన సదస్సులో 1200 మంది సైన్స్ నిపుణులు, హెల్త్‌కేర్ ప్రతినిధులు, ఏఏహెచ్‌ఏ గ్లోబల్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి సదస్సుకు హాజరైన వారికి ఆహా సంస్థ సీపీఆర్ సిమ్ వార్ కాంపిటీషన్ నిర్వహించింది. పోటీలో వివిధ జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు పలు వైద్య కళాశాలలు, ఆస్పత్రులు తమ తమ తరఫున ఏడు మంది సభ్యుల బృందాలను పోటీలోకి బరిలోకి దింపారు. చివరి రోజు ఆదివారం ఫైనల్ రౌండ్ జరిగింది. ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ (108 సర్వీసెస్) హైదరాబాద్ బృందంలోని సభ్యులు డాక్టర్ జావేద్, డాక్టర్ రవీన్, డాక్టర్ కేశవ్, డాక్టర్ రాజభరత్, డాక్టర్ రవి, డాక్టర్ సతీష్, ఫణిలు ఐఈఎంఎస్ కేరళను ఓడించి ట్రోఫీని గెలుచుకున్నారు. ఉత్సవాల్లో సత్తా చాటి విజయం సాధించిన ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.

నిథమ్‌లో ముగిసిన గ్రామీణ మహిళలకు శిక్షణ

రాయదుర్గం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పటల్స్ మేనేజ్‌మెంట్ (నిథమ్) క్యాంపస్‌లో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ, తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద గ్రామీణ మహిళలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాంటీన్ మేనేజ్‌మెంట్‌లలో పలు జిల్లాల నుంచి ఎంపిక చేసిన మహిళలకు పది రోజుల శిక్షణ సోమవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో 450 మంది మహిళలు శిక్షణ పొందారు. భవిష్యత్‌లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని నిథమ్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ ఫైనాన్స్ కాంతి, డైరెక్టర్లు గోపాల్‌రావు, ప్రశాంతి, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, జనరల్ సెక్రటరీ రవిబురా, ఎన్ఐటీహెచ్‌ఎం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేశ్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ మిచెల్‌ప్రాన్సిస్ పాల్గొన్నారు.

టీహబ్‌తో పానాసోనిక్‌తో అవగాహన

రాయదుర్గం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇండియాలో నెక్సస్ హై డెఫినిషన్ పవర్ లైన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోసం పానాసోనిక్ సంస్థ టీ హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం టీహబ్‌లో జరిగిన అవగాహన ఒప్పంద కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్ ఇండియా చీఫ్ ఇనోవేషన్ ఆఫీసర్ కోటారో మాట్సుమో మాట్లాడుతూ.. పానాసోనిక్ ఓపెన్ ఇన్నోవేషన్‌కు సాంకేతిక సహకారాన్ని వచ్చే కస్టమర్లకు ఎదురయ్యే క్లిష్టమైన సవాళ్లు పరిష్కరించడానికి టీహబ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం తమకు మేలు చేస్తుందన్నారు. టీహబ్ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీహబ్ నూతన ఆవిష్కరణలు పెంపొందించడానికి, స్టాటప్‌లను ప్రపంచ వ్యాప్తంగా అవసరమైన వనరులతో సాధికారిత కల్పించడానికి అంకితభావంతో కృషి చేస్తోందన్నారు. పానాసోనిక్‌తో తమ సహకారం కొత్త అవకాశాలు అందిస్తుందన్నారు. ఉత్తర అమెరికా, జపనీస్ మార్కెట్లను యాక్సెస్ చేయడానికి ప్రత్యేకమైన ప్లాట్‌ఫాంగా ఈ ఒప్పందం అనిపిస్తుందన్నారు.

లాంగ్‌లీవ్‌లో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్

నిజాంపేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ డి.సౌజన్య లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. మంగళవారం నుంచి తన విధులకు హాజరుకావడం లేదని అధికారులనుంచి అనుమతి తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన నెలరోజులకే ఈమె తన బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లడం పెద్ద చర్చాంశనీయంగా మారింది. కమిషనర్‌గా బాధ్యత చేపట్టిన నాటి నుంచి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఇతర పార్టీల నాయకుల ఒత్తిళ్ల అధికంగా కావడం, కార్పొరేషన్‌లో అన్ని విభాగాలకు అధికారులు లేకపోవడం, సిబ్బంది కొరతతో విధులు నిర్వహించడం కష్టతరంగా మారినట్టు తెలుస్తోంది. ప్రధానంగా అక్రమ నిర్మాణాల విషయంలో ఇరు పార్టీల నాయకులు కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువస్తుండటంతో నిక్కచ్చిగా ముందుకు సాగుతున్న ఈమె తట్టుకోలేక లీవ్‌లో వెళ్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాక టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గత కొంత కాలం అవినీతి కేసులో ఇరుక్కోవడం ఆపోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌చార్జి టీపీఓ రెండు చోట్ల పని చేయాల్సి రావడంతో పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారు.

చిన్నారులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారు : ఎంపీ ఈటల

నిజాంపేట్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన్నారులను ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు చేస్తారని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చిన్నారులకు అవకాశాలు కల్పిస్తున్న సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యవోలు రాంబాబు, సత్యవోలు పూజిత టీమ్‌ను ఆయన అభినందించారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్సు పర్యవేక్షణలో 125 మంది చిన్నారులు, కళాకారులు 128 నిమిషాల్లో, 125 గణేశ్ చిత్రాలతో రికార్డు సాధించే పయత్నం చేశారు. ఈ కార్యక్రమం సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్ హాజరై చిన్నారులు, చిత్రకారులు గీసిన చిత్రాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు డాక్టర్ ఎంఆర్‌ఎస్ రాజు, రైలు వికాస్ నిగమ్ జర్నల్ మేనేజర్ ఆనంద్, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్, వీఆర్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్, ట్రస్టీ వల్లూరిపల్లి రమణ, విజ్ఞాన జ్యోతి స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణి, సీఓ డాక్టర్ కిషోర్‌కుమార్, ప్రముఖ చిత్రకారులు శేషాబ్రహ్మం, కృష్ణాది శేష, డాక్టర్ మార్కేండేయులు పాల్గొన్నారు.



పెయింటింగ్‌లో పాల్గొన్న చిన్నారులు, చిత్రకారులు

బీజేపీతోనే అభివృద్ధి

గాజులరామారం: బీజేపీతోనే నియోజకవర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని మహారాజా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని, గాజులరామారం మాజీ సర్పంచ్ పగిడి శంకర్‌రెడ్డికి సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డిని పరామర్శించిన ఈటల

షాపూర్‌నగర్: అనారోగ్యానికి గురైన బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డిని ఆయన నివాసంలో ఎంపీ రాజేందర్, జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్, గిరివర్ధన్‌రెడ్డిలు సోమవారం పరామర్శించారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం

జీడిమెట్ల: సూరారంలోని రాజీవ్‌గృహకల్ప 34వ బ్లాక్‌లో నివాసం ఉంటున్న దివ్యాంగుడు ఎం.శ్రీకాంత్‌కు ప్రేరణ సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు నిత్యం తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కె.లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు అంజయ్య, ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.